


# పరిణామం

పోగుల కోటేశ్వరరావు

ఆనందానికీ, అనురాగానికీ, సౌజన్యానికీ, సౌందర్యానికీ ఆలవాలమైన భర్తను తనకళ్ళముందు చిన్ననాటినుండీ చిత్రించుకుంటూ పెరిగింది శారద. ఆమె మనో నేత్రాలలో ఎల్లప్పుడూ మసలుతూండేది—పాలరాతి స్థంభాలపైన పెద్ద ప్రాకారం, చుట్టూ విశాలమైన ఉద్యానవనం, మధ్యలో చక్కని లతలలో కూర్చబడిన ఓ చిన్న మందిరం. ఆ మందిరంలో ఆకుల మధ్యనుండి దాగుడు మూతలాడుతుంటూ ప్రకాశించే చంద్రబింబం. తన సరసన చంద్రబింబంతో పోటీపడి అమృతాన్నొలికించే భర్త... ఇలాంటి మధుర స్వప్నాలు ఆమె రేయింబవళ్ళూ తిలకించుతూ ఒక్కొక్కరోజు అరేబియన్ నైట్సు కథల్లోని ఒక్కొక్క పేజీ తలచుకుంటూ జీవితపు బాటమీద పదహారవ మైలురాయి చేరుకున్నది శారద.

దబ్బపండులాంటి పచ్చని శరీరం మీద నాగుబాము కుసం లాంటి సన్నని వోణీ పిల్లగాలికి సన్నగా కదులుతూ, మెదులుతూ శారద ఆ ఇంట్లో ఇవతల వస్తువులుతీసి అవతల పెడుతూ వుంటే ఆ ఇంటికి ఓ వింతశోభ చేకూరినట్టుగా వుండేది. ఆడపిల్లముద్దు అత్తవారింటికి పోయేవరకేగదా అని అందరి ఆడవాళ్ళలాగానే శారద తల్లిగూడా ఆమెను అల్లారు ముద్దుగా పెంచి పెద్దదాన్ని చేసింది. అందువల్లనే శారద కళ్ళముందు ఎల్లప్పుడూ స్వప్నదృశ్యాలు గోచరించుతుంటవని చెప్పాల్సొంటుందేమో! ఆడపిల్లలను తల్లిదండ్రులు పెంచినంతకాలమూ తూగుటుయ్యాలలో ఓలలాడించడం మన సాంప్రదాయంలో జీర్ణించుకుపోయిన ఒక అంశమేకదూ! తుదకు వివాహం విషయం ప్రస్తావించే సరికి మహాభారంగా యెంచుతారు ఆ ముద్దు బిడ్డనే! యే విధంగానైనా సరే ఉన్నంతవరకూ ఊడ్చిపెట్టి కులమంటి కోతికి అంటగట్టితే తమ భారం తీరిపోతుందిగదా! అని ఎప్పటికప్పుడు బరువైన నిట్టూర్పు విడుస్తారు తల్లిదండ్రులూ, అభిమానంగల తదితరులున్నూ. ఆడపిల్ల భూమ్మీద పడ్డరోజున ఆ బిడ్డవంక అమ్మలక్కలందరూ మెటిక

విరుస్తారు_అయ్యో! ఆడపిల్ల! అని. కాని బంగారు బొమ్మలాగు పెంచుతారు. వివాహం చేయడమంటే యమయాతనగా భావిస్తారు. తిరిగి ఆ పిల్ల అత్తవారింటికి పోతూంటే యేడుస్తారు! ఇలాగా ఆడపిల్లల పదిహేను సంవత్సరాల జీవిత చక్రం ఇన్ని వలయాలు తిరగాల్సొంటుందని మనందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ, ఇందులోని ప్రత్యేకతను గమనించిన వాళ్ళుగాని, తగు ప్రాధాన్యతనిచ్చి ఆలోచించిన వాళ్ళుగాని బహు అరుదు అని చెప్పక తప్పదు.

శారద వివాహభారం గూడా తీర్చేసుకున్నారు ఆమె తల్లిదండ్రులు. సాంప్రదాయం, సంస్కారంగల కుటుంబం అన్నారు. సంపద, సౌశీల్యమూగల సంసారం అని చెప్పుకున్నారు. మాటకూ మంచికీ నిలబడే వాళ్ళని ప్రశంశింప బడిన వంశం లోనే ఒక వరుణ్ణి వెతుక్కొని తెచ్చారు.

అయితే శారద కోర్కెలన్నీ నీటిమీద గీతల్లాగు నిముషాలమీద చెరిగిపోయినవి. ఆమె సృష్టించుకున్న స్వర్గంలో ఆవగింజయెత్తు కూడా పొందలేక పోయినందుకు ఆమె యెంతగా విలపించిందో పాపం! జీవిత సోపాన పథంలో ఒక్కొక్క వ్యక్తి సరాసరి నిచ్చెనలెక్కి పరమపద సోపానం చేర్దు కుంటానికి ఆశించి, ఆరంభంలోనే పాములు గరచి క్రిందకు జారిపోవడం కద్దు. మరొక వ్యక్తి అంచల మీద ప్రయాణించి కడకు 'వైకుంఠం' చేరుకో బోయేముందు పెద్దపాము నోట్లోకి ఆహుతి కావడం గూడ సంభవిస్తుంది. ఆయా వ్యక్తుల నిరాశ, నిస్పృహ, ఎంతమంది కవులకు ప్రియమైన కథావస్తువు కాగలిగిందో!

నిస్పృహ, నిరాశలను వెంటనిడుకుని శారద అత్తవారింటికి వెళ్ళింది. గడపలో కాలు పెట్టంగానే ఝుమ్మని గయ్యాళి తనం చేసే అత్తగారు ఆ ఇంట్లో లేదు. సూటీపోటీ మాటలంటూ మొగణ్ణి మించి అధికారం చెలాయించుకునే ఆడ బిడ్డలు గూడా యెవరూలేరు. చీటికీ మాటికీ చీదరించుకుని అర్థం పర్థం లేకుండా హడావుడిచేసే మగవాడు కాదు శారద పెనిమిటి. జీవిత వ్యాపారంలో సంపూర్ణ భాగస్వామిగా భార్యను యెంచుకుంటాడు సుబ్బారావు. కష్టసుఖాలు సమిష్టిగా ఎదుర్కొని లాభ నష్టాలు సమానంగా పంచుకోవాలని అభిప్రాయపడే మగవాళ్ళల్లో సుబ్బారావు ఒకడు. మగవారికి "అందం" అంటూ ఒకటి వున్నది అని తీర్మానించుకున్న పక్షంలో సుబ్బారావు అందగాడు కాదని అంగీకరించక తప్పదు. అయితే ఒక వ్యక్తిలో మనం పరిగణించాల్సిన విషయాలు ఆత్మ గౌరవమూ, అభిమానమూ, సహృదయమూ నాగరికతా ఉచితప్రవర్తనా అని భావించినట్లైతే సుబ్బారావు ఈ గుణగణాల్లో ఆధిక్యతను పొందినవాడని చెప్పవలసి వుంటుంది.

అయితే శారదకు ఏదో తీరనిలోటు జరిగినట్టుగా ఆమె ఎల్లప్పుడూ ఏదో తెలియని బాధ అనుభవించుతూనే వుండేది. నిత్యమూ గంటల తరబడి ఆమె ఒంటరిగా గదిలో మంచంమీద పడుకుని తెల్లని గోడల వంక శూన్యంగా చూస్తూ

కాలం గడుపుతూండేది. ఆమె హృదయ కుహరంలో ఏదో బలీయమైన గాయం తగిలినట్టుగా, ఆమె సదా హింసకు గురి యైనట్టుగా ఆమె ముఖ కవళికలు చాటి చెబుతూండేవి. ప్రతి రోజూ సాయం కాలం భర్త ఆఫీసునుంచి రాగానే ఆమె ఎర్రబారిన కళ్ళతో స్వాగతమిస్తూ వుండటం ఆ ఇంట్లో తప్పని సరియైన దృశ్యంగా పరిణమించింది.

సుబ్బారావు మనస్సు నిబ్బరం కల వాడు కాకపోయినా, తొందర, తొట్రుపాటు గల వ్యక్తి మాత్రం కాదు. ఆమె మనస్తత్వాన్ని అర్థం చేసుకుని ఆమె సంతత సంతాపానికి విరుగుడు కనుక్కో వాలని తలబ్రద్దలయేట్టుగా ఆలోచించే వాడు. ఒక్కొక్క రోజు రాత్రి ప్రొద్దు పోయేవరకూ అదే ఆలోచనలతో స్నానం పానం లేకుండా పడి వుండే వాడు. కాని తెల్లవారి లేచి తిరిగి యథాప్రకారం ఆఫీసు డ్యూటీకి హాజరుకాడం—ఈ విధంగా కాలం మర చక్రంలాగా దొర్లిపోతూ వచ్చింది.

సుబ్బారావు ఒక్కొక్కసారి అనుకునే వాడు—తనుబాగా డబ్బు సంపాదించే వాడైనట్లైతే తన భార్యకు రకరకాల వినోదాలను చేకూర్చి దేశదేశాల వింత లను వినిపించి ఆమెను మైమరపించి స్వాధీనంలోకి తెచ్చుకుని వుండేవాణ్ణి గదా! అని. అయితే అలాంటి అదృష్టం ఎంత మందికి సాధ్యపడుతుంది? అని మెలకువ తెచ్చుకుని ఒకనిట్టూర్పు విడిచే వాడు.

శారద రోజు రోజుకూ వేడెక్కి పోతోంది. ఆ వేడిగాలిలో అంతకంతకూ అత్యున్నత శిఖరాలను ఆమె మనో నేత్రాలు అందుకుంటూండేవి. తనూ తన భర్త వాక్స్హాలు సెడాన్ కారులో కూర్చుని చైనాబజారు గుండా వెళ్ళి బీచీ చేరుకుని సాయంకాలం చల్లగాలికి సము ద్రపుటొడ్డున గంభీరమైన ఆ అలల ముద్దు లాట చూస్తూంటే ఎంత బాగుంటుంది! గిండీ రేసు కోర్సుకు వెళ్ళి చలవరాతి సీట్లమీద తనభర్త ట్వీడుసూట్లో, తను ఆర్గండీవాయిల్ చీరె చెరగు కానుకుని కూర్చుని, తను బైనాక్యూలర్సులోగుండా శరవేగంతో పరుగెత్తుతూన్న గుఱ్ఱాలను చూస్తూవుంటే, చుట్టూ కూర్చున్న వాళ్లు తనను చూచి ఈర్ష్య పడుతూంటే ఎంత ఆనందంగా వుంటుంది! వింతలూ, వినో దాలతో తను అలసిసొలసి ఇల్లుచేరుకుని హాయిగా ఎయిర్ కండిషన్డు రూములో చంద్రబింబాకారంలో వెలుగుతూన్న మెర్క్యూరీ దీపం కాంతిలో ముఖమల్ పరుపుమీద మేను వ్రాల్చి అర్థ నిమీలిత నేత్రాలతో తన భర్తవంక గోముగా ఓరగన్నుతో చూస్తూ ఆమె మూతిని సమీపిస్తున్న అతని పెదిమలను చూస్తూ సిగు పడి దాగుడు మూతలాగు ప్రక్కకు తప్పుకుని, ఆశాభంగం పొందిన భర్తను తిరిగి బుజ్జగించి... వహ్!... న్యూయార్కు స్కై స్క్రాపర్సును తల దన్నిన ఊహా సౌధాల్లో విహరించుతూ, తిరిగి మన ప్రపంచంలో కొచ్చి ముఖం విలవిల బుచ్చుకుని నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా వుండాల్సిన తమ దాంపత్య

జీవనాన్ని నిత్య నిర్వేదంగా మార్చుకుని కాలం గడుపుతూన్నది శారద.

అనుకోకుండా సుబ్బారావు వుద్యోగంలో ఒక మాదిరి మార్పు వచ్చి మరి నాలుగు రాళ్ళు చేతిలో పడే అదృష్టం కలిగింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వుద్దేశంతో తన జీవిత భాగస్వామిని కోరికలో కనీసం ఒక వీసమైనా చెల్లించగలననే ధీమాతో, తను ఇంతవరకూ నివాసం ఉంటూ వచ్చిన చీకటి కొట్టులాంటి ఓ రెండు గదుల పెంకుటిల్లును విడనాడి ఈసారి నిర్మలమైన ప్రాంతంలో క్రొత్తగా నిర్మించిన ఒక బంగాళాలో ఒక ప్లాటు అద్దెకు పుచ్చుకున్నాడు. ఈ మార్పువల్ల తన భార్య మానసిక ప్రవృత్తిలో కొంతైనా పురోభివృద్ధి పొడసూపక పోతుందా! అని భావించాడు. అయితే లేశ మాత్రం గూడా అతను ప్రతిఫలం పొందలేక పోయినందుకు ఎంతగానో విచారించాడు. కొంతమంది జీవితం ప్రారంభించబోయే ముందుగా విజయ పూర్వకమైన తత్వంలో బయిల్దేరి కడకు ఓటమి తరువాత ఓటమి పొంది, తుదకు దిగజారుడు మనస్తత్వం పొందటం ఈ ఇరవయ్యో శతాబ్దపు నాగరికతలో ఒక భాగమై కూర్చున్నది! రానురాను సుబ్బారావు ఈ తరగతిలో చేరిపోతాడేమోనని అనుమానించడానికి ఆస్కారం యేర్పడ్డది.

మామూలుగానే శారద ఈ క్రొత్త నివాసంలో సయితం యేకాంతవాసం గడుపుతూ ఒకరోజున ఎందుకో అప్రయత్నంగా కిటికీలోకుండా ఎదురుగ్గా కనిపిస్తున్న బంగళాలోకి దృష్టిని సారించింది_ గాజు తలుపులు వెనుకాల బలమైన చేతులు వంకెనుంచి కోటుతీసుకుని తొడుక్కుని కొంచెంగా తలక్రిందకు వంచి మాట్లాడుతున్నట్లుగా పెదిమల కదలిక ఆమెకు కనుపించిద్ది. ఆ వ్యక్తి సమీపంలో అతనికోటు అంచులు పుచ్చుకుని సన్నని వ్రేళ్ళు గిలిగింతలు పెడుతున్నట్లుగా కదులుతున్నాయి. ఆ వ్రేళ్లకు పులుముకున్న గులాబీరంగుతో మేళవింపుగా ఆ చెయ్యి, చేతిమీద సన్నగా కదుల్లాడుతున్న బిస్కెట్ రంగు సిల్కుచీర శారద దృష్టిని తదేకంగా నిలబెట్టినవి. అలా చూస్తూ వుండగానే ఆవ్యక్తులిద్దరూ కిటికీ వైపుకు వీపు మరలించారు. శారద కళ్ళముందు దృశ్యం ఒక్కక్షణంలో మాయమై పోయింది.

ఆదుర్దాగా పడక మీదనుంచి లేచి కిటికీదగ్గరకొచ్చి నిలబడ్డది శారద. ఆ ఎదురుగా కనుపించే బంగళా వరండాలో ఇందాక చూచిన కోటూ, చీర కనుపించాయి. చెట్టాపట్టాలుగా చేతులు బుచ్చుకుని ఆవ్యక్తులిద్దరూ నడచివెళుతూ గేటు ముందు నిగనిగలాడుతూ నిలబడివున్న కారులో జొరబడ్డారు. తాబేలులాగా దొర్లిపోయింది శారద కళ్ళముందు కారు.

కలవరపాటు చెందిన మనస్సుతో, కలతనిద్ర పొంది బడకంగా . మరునాడు నిద్రలేచింది శారద. మానవ జీవితం దిన దిన గండం నూరేళ్లాయుష్షు అనే సామెత ఎవరిపట్ల నిజము కాకపోయినా శారద విషయంలో మాత్రం అక్షరాల సత్యమని బుజువై కూర్చున్నది. ఆరోజున ఆఫీసుకు

సెలవు కావడంచేత సుబ్బారావు ఇంట్లోనే ఉండిపోయాడు. పండగపూట కొంచెం సర్దాగా బీచీకి షికారుకు పోదామని సర్దా పుట్టింది సుబ్బారావుకు. యెంతో ప్రయత్నంమీద భార్యను ఒప్పించ గలిగినందుకు సంతోషించాడు.

బీచీ వొడ్డున ఇసుక తిన్నెలమీద కూర్చుని ఆకాశాన్ని అంటుకుంటూ లేచిన అలలు తిరిగి నేలను ఢీకొని పారిపోవడం చూస్తూ సుబ్బారావు మత్తుగా కళ్ళు బరువుగా రెప్పలు కొంచెం మూసుకుని మధ్య మధ్య భార్యవంక ఆప్యాయంగా చూస్తున్నాడు. శారద హృదయంలో ఆ సముద్రపు తరంగాలను మించిన ఘోష సదా హోరు మ్రోగుతోంది. సుబ్బారావు ఆమెకు మరింత దగ్గరగా జరిగి తియ్య తియ్యని మాటలు జెప్పి ప్రొద్దుబుచ్చాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. శారదమాత్రం అయిష్టతగానే వింటూ, ఊకొట్టుతూ, ఆ మాటల్లో తనకేమాత్రమూ మాధుర్యం గోచరించటం లేదని బిగుతుగా వున్న ఆమె పెదమలమీద తెలియ చేస్తోంది.

"హల్లో" అంటూ సుబ్బారావును ఓ క్రొత్తవ్యక్తి పలకరించాడు. శారద సుబ్బారావు, ఇద్దరూ లేచి నిలబడ్డారు. శారద ఆ క్రొత్తవ్యక్తిని అప్రయత్నంగానే పరాపర్నగానే చూచింది. ఆవ్యక్తి చేయి పుచ్చుకుని సన్నగా నాజూగ్గా నిలబడి కాలి వ్రేళ్ళతో ఇసుకను మీటుతూ నిలబడి వున్నది ఒక మగువ. వారిద్దరినీ చూస్తూ శారద ఏమేమో దృశ్యాలను జ్ఞప్తికి తెచ్చుకుంటున్నది—నిన్న సాయంకాలం కిటికీలోంచి కనుపించిన దృశ్యం అటు తరువాత బంగాళా వరండాలో జంటగా నడచి వెళ్ళిన వ్యక్తులు—ఆమె కళ్ళ ముందు ఇప్పుడు చూస్తోంది.

సుబ్బారావు ఆ వ్యక్తుల నిద్దరినీ శారదకు పరిచయంచేశాడు. ఫలానా కంపెనీలో కమ్మర్షియల్ మానేజరుగా పనిచేస్తూన్నారు, వెంకట్రావుగారు. వ్యవహార జ్ఞానం వ్యాపారదక్షతగలవ్యక్తి. ఇటీవలనే మద్రాసులో వుద్యోగానికివొచ్చారు. మన ఇంటిప్రక్క బంగళాలో వుంటున్నది వీరే అని ఇంకా యేమేమో చెప్పాడు భార్యకు. శారద కొంచెం దూరంగా నిలబడి ఓ నమస్కారంపడిలేసి ముఖం ప్రక్కకు త్రిప్పి నిలబడ్డది. క్రొత్తవ్యక్తిభార్య చొరవ తీసుకుని శారదను పలకరించింది. ఆమె చెయ్యి పుచ్చుకుని నాలుగ్గజాలు ముందుకు నడచి అక్కడ చతికిలబడి పిచ్చాపాటి కబుర్లు చెప్పడం మొదలు పెట్టింది. పోతే. సుబ్బారావు, ఆ పెద్ద మనిషి, వీరిద్దరూ వివిధ రాజ్యాల భవిష్యత్తు మొదలుకొని హోటళ్ళలో ఫలహారాలవరకూ చర్చించారు.

ఆరోజు సాయంకాలంనుండి శారద ముఖకవళికల్లో మార్పులు గాఢ చూపడం సుబ్బారావు గమనించగలిగాడు. ఈ మార్పులు ఎటువంటి పరిణామాలకు దారి తీస్తవో అప్పట్లో అతను అవగతం చేసుకోలేకపోయాడు. అంతేగాక, తమ దాంపత్య జీవితంలో తాను ఇతఃపూర్వం కానలేకపోయిన సౌఖ్యానికీ, ప్రశాంతికీ దారి తీస్తుందేమోనని ఆశించడం అతనికి సహజంగానే కనుపించింది. ఒక వ్యక్తి వక్రమార్గాన ఆలోచించాలంటే

ఆ వ్యక్తిలో కొన్ని నీచ భావాలు నాటుకుని వుండాలిగా మరి !

రెండు మూడు రోజులు గడిచేలోగా శారదకు, పొరిగింటి బంగళాలో నివసించే వెంకట్రావుగారి భార్యకు మధ్య పరిచయం ఎంతవరకూ వచ్చిందయ్యా అంటే, వారింటికి వీరు వస్తూపోతూ ఉండటం, వీరింట్లో వారు వద్దువద్దు అంటూనే ఒక కప్పు కాఫీగాని, టీగాని, యేవేళప్పుడు ఆ పానీయం పుచ్చుకోవడటం ఆమె పుట్టుపూర్వోత్తరాలు ఈమెకు, ఈమె నగలు నాణ్యాలను గురించి ఆమెకు తెలియజేయడం— అంతవరకూ వచ్చింది.

శారద అప్పుడప్పుడు తనగదిలో పడుకుని కిటికీలోగుండా ఆక్రొత్తవ్యక్తి ఇంట్లో దృశ్యాలను పరికించుతూండేది. దీనికి తోడుగా వారింటికి వెళ్ళినప్పుడు వెంకట్రావుగారు లేనిసమయంలో గదులన్నీ పరామర్శించి, గోడల కమర్చబడిన రకరకాల ఫొటోలను, చిత్రలేఖనములను గదిలోవున్న సామాన్లనూ చూచి మురిసిపోతుండేది.

తాను ఆ ఇంట్లో చూచిన దృశ్యాలు, తాను పరికించిన వ్యక్తి శారద ఏకాంతంగా కూర్చున్నప్పుడు ఆమె కళ్ళముందు రీలు తిరుగుతూండేది. ఆలోచనలతో అలసిన శరీరం, బడలిక చెందిన మనస్సు ఇలలో ఎలాంటి సుఖాన్ని అనుభవించలేకపోయినా, కలలో స్వర్గసీమల్లో విహరించ గలుగుతూంది.

—పిండారబోసినట్టు వెన్నెల. బంగారు తీగెలాగు మెరిసే మాలతీలత పొదచాటున అపూర్వమైన వ్యక్తితో ఆమె దాగుడుమూత లాడుతుండేది. ఒకరోజు —

—సముద్రపు ఒడ్డున నీటి తుంపరులకు శరీరం గగుర్పొడిచి అతని మేనుపై వ్రాలిపోయేది. మరొకరోజు—

—తోటమధ్య, చంద్రబింబంలాగు ప్రకాశిస్తున్న అతన్ని అనుసరించి నడుస్తూండేది నక్షత్రవీథిని. వేరొకరోజున—

—సెలయేటి గట్టుమీద మామిడి చిగుళ్ళు మెక్కి బలసియున్న కోయిల కూతలకు కనురెప్పలు బరువెక్కి, శరీరం మధువును గ్రోలినట్టుగా మైమరచి అతని ముఖంలోకి. ఆమెముఖం చేర్చేది ఇంకొకరోజు—

తీరశ్శా ఒకరోజున వాళ్ళ ఇంటికి వెళ్ళింది, ఆయన భార్యతో ఏమేమో విశేషాలు ముచ్చటించేందుకు. ముందువా వాకిలి దగ్గరకు ఆయన భార్య చేతిలో షాంపూ సీసాపుచ్చుకుని పొడవైన జుట్టును సన్నని వ్రేళ్ళతో దెన్నుకుంటూ ఎదురైంది. మందహాసంతో శారదను పలకరించి "అలాగా, ఆప్రక్క గదిలోకి వెళ్ళికూర్చోండి. ఇప్పుడే పది నిముషాల్లో వచ్చేస్తాను" అంటూ ముందుకు సాగిపోయింది. శారద ఆమె వెళుతూన్న వైపుకు చూస్తూ ఈ ప్రక్కగదిలోకి జొరబడ్డది అనాలోచితంగా. గది వాకిలి ప్రక్కగా మేజాబల్లమీద నున్న గాజు కూజాలోని పూలగుత్తికి ఆమె పమిటి చెరుగు విసురుడుగా తగలటంతో 'ధనా' మని కూజా క్రిందబడి పదహారు ముక్కలైంది. శారద బిత్తరపోయి చూస్తున్నది.

నాలుగైదడుగుల దూరంలో కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటూన్న వెంకట్రావుగారు ఝల్లున పేపరు వదిలేసి అదిరిపడిలేచాడు. వేటగాణ్ని చూచిన లేగ హరిణం మోస్తరుగా శారదకళ్ళు టక్కు టక్కుమని కదిలించి పమిట సర్దుకున్నది.

"పర్వాలేదులెండి. అటు ఆ గదిలోకి వెళ్ళికూర్చోండి" అంటూ పగిలిపోయిన గాజుముక్కలను పోగుచేస్తున్న శారదను వారించాడు వెంకట్రావు.

శారద కృతజ్ఞతా పూర్వకంగా అతని వంక దృష్టిని సారించింది. ఆ చూపుల్లో ఏదో మాధుర్యాన్ని, ఆ కండ్లనుండి ప్రసరించే వెలుతురు కోణాల్లో అనిర్వచనీయమైన అనురాగ తరంగాలను, వణుకుతున్న ఆమె పెదిమలమీద నాట్యంచేస్తున్న సందేశాన్ని అతను చవిచూడగలిగాడు. అతని ముఖవైఖరినిబట్టి అతని హృదయ కుహరంలో ఉద్భవించిన ఉత్తేజ పూర్వకమైన వాంఛితాన్ని ఆమె పసికట్టగలిగింది. ఆగదిలోపల వాతావరణం వారిరువురి మౌనకథనంలో నిండిపోయింది!

ఆరోజు సాయంకాలం శారద తలంటి స్నానంచేసి వీధివాకిల్లో కూర్చుని జుట్టు ఆరబెట్టుకుంటున్నది. సుబ్బారావు ఆఫీసు నుండి ఇంటికి చేరుకునేందుకు ఇంకా ఒక అరగంట ఆలస్యముంటుంది. ఆమె అక్కడ కూచుని మబ్బులవంక సాలోచనగా చూస్తూవుండగా ఆమె కళ్ళముందు ఒక వుత్తరం ప్రత్యక్షమైంది.

"సంఘానికి బానిసవై, నీ సౌందర్యాన్ని, సౌజన్యాన్ని ఒక వెర్రి వెంగళాయప్పకు అప్పగించడం చూస్తూంటే హృదయంగల యే మానవుడు సహించగలడు? శారదా! నీ కంటిచూపు కోసం నాలాంటి కాలి మీద జపం చేసేవాళ్ళు వేలకు వేలు పడి చస్తూవుంటే నీ విలాగున నిర్లక్ష్య భావంతో నీ జీవితసౌభాగ్యాన్ని నిరర్థకం చేసుకోవడం భగవంతుని అభీష్టాన్ని త్రోసిరాజనడమే కాగలదని ఇప్పటికైనా నీవు గ్రహించితీరాలి... నీ కోమలబాహు వల్లరిలో ఇమిడిపోవాలని ఈ ప్రాణి ఎంతగా తపించిపోతోందో నీ మనో నేత్రాలలో ఒక్కసారి పరికించి చూడు... నా వాంఛితం నేను యీడేర్చుకోనలేక పోయిన పక్షంలో నాకు గత్యంతరం ఒక్కటే! నీ ప్రేమ గీతాన్ని ఆలాపన చేస్తూ నేను తాంబుర చేతబట్టి బైరాగినై గ్రామగ్రామాలు సంచరించి నీ కాఠిన్యతను చాటింపు వేయక తప్పదు!! నాస్వరం నుండి బయల్దేరిన ఆలాపనలు వాతావరణంలో కలిసిపోయి నీవు కానరాని కీకారణ్యంలో వున్నప్పటికీ నీ చెవుల్లో మారు మ్రోగి నీ హృదయాన్ని కరిగించక మానవు!!!... కనికరించవూ? ఎదురుచూస్తున్నా.

"వెంకట్రావు"

అర్థంకాని ఆవేదన ఒక వంక, అంతులేని ఆశ మరొక వంక శారదను ముచ్చెమటతో ముంచేసినాయి. సాయంకాలం చల్లగాలికి ఇటునటు కదులాడుతున్న సన్నజాజి రెమ్మల్లాగు వణుకుతూన్న చేతులతో ఆ వుత్తరాన్ని జిగిబిగిగా మడతబెట్టి తన జాకెట్టులోపల తన హృదయపేటికలో భద్రంగా దాచి వుంచాలనే

ప్రయత్నంలో ఆమె చేతులు పమిటి చెరగును చేరుకుంటున్న సమయంలో అల్లంత దూరాన మసక మసక చీకట్లో తేలి పోతూన్న అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు—సుబ్బారావు. గ్రుడ్లు రెండూ ఆ దిశకు అప్పగించి కూర్చుండి పోయింది శారద. ఆమె హృదయంలో దాచుకుందామనుకున్న ఆవుత్తరం చెమటకు నాని పోయిన జాకెట్టులోగుండా మరింత ఆకర్షణీయంగా ఎదుటివాళ్ళకు కనుపిస్తోంది. సుబ్బారావు ఆమెను సమీపించగానే చటాలునలేచి నిలబడ్డది. అర్థంకాక అయోమయంలోపడికొట్టుకుంటున్నాడు సుబ్బారావు, భార్య ప్రవర్తనచూచి. పైకిక్రిందకు చూచి ఆమె రేణుకలాగున పరుగెత్తుకు పోయింది. సుబ్బారావుకు దాదాపు భయం వేసి చరచరాసాగి ఆమెను అనుసరించాడు. గదిలోకి వెళ్ళిన శారద గిర్రున వెనక్కు తిరిగి వాకిలి దగ్గరగా నుంచున్న సుబ్బారావు వంక భయకంపితయైచూస్తూనే కిటికీ దగ్గరకు పరుగెత్తేందుకు ఉద్యుక్తురాలైంది. క్షణం వ్యవధి లేకుండానే కిటికీలోంచి బయటకు పోతూన్న ఆమె చేతిలోని వుత్తరాన్ని పట్టుకున్నాడు. చెమటకు నానిపోయిన కాగితం ఆమె చేతి కంటుకుపోయింది. ‘కేవ్’ మని పెంకులు లేచిపోయేట్టు అరచింది శారద. వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఆమె చేతిని మరింత బిగుతుగా పుచ్చుకుని నడిపించుకొచ్చాడు. చైతన్య విహీనమైన శారదను తీసుకొచ్చి మంచం మీద కూచోబెట్టాడు.

“శారదా! యెందుకలా భయపడతావ్!” అన్నాడు సుబ్బారావు. ఆమె చేతిని విడువనూలేదు. ఆ చేతిలోని ఉత్తరాన్ని అతను లాక్కోనూలేదు.

“శారదా! మాట్లాడవేం” అంటూ అతను ఆమె ముఖంలోకిచూశాడు. ఆమె ముఖం నల్లబారిపోయింది. ఆమె చేతితో ఇంక ఆ ఉత్తరాన్ని పుచ్చుకొనలేని స్థితిలో కొచ్చింది. ఆమె రొమ్ములు బరువుగా లేచి నిరుత్సాహంగా వ్రాలిపోతున్నాయి. ఆమె చేతివ్రేళ్ళలోని పటుత్వాన్ని ఇట్టే కోల్పోయింది. ఆమె చేతిలోని ఉత్తరాన్ని అతని చేతిలోకి జారవిడిచింది.

“శారదా! నావంకచూడు ఒక్కసారి” అని గద్గదస్వరంతో బిగ్గరగా పిలిచాడు సుబ్బారావు. ఆమె కళ్ళు పెద్దవిగా వున్నాయిగాని దృష్టికి మాత్రం యే వస్తువూ తగిలేట్టుగా లేదు.

“శారదా! ఇటుచూడు! యిదిగో ఉత్తరం!”

ఆమె కదల్లేదు.

“శారదా! ఇదిగోవుత్తరం! తీసుకో!”

ఆమె మెదలలేదు.

“శారదా! ఈ వుత్తరం నీదే!”

ఆమె ముఖం మీదనుండి చంపల మీదుగా చమట బిందువులు టప్‌టప్‌మని వక్షం మీదకు రాలుతున్నాయి.

ఆమె నడుం చుట్టూ అతని చేతులు పోనిచ్చి వొళ్ళోకి తీసుకున్నాడు సుబ్బారావు. వుత్తరం వున్న చేతితో ఆమె గడ్డం పుచ్చుకుని ముఖం పైకెత్తిచూచాడు.

చైతన్య హీనంగా ఆమె అలాగే చూస్తున్నది రెప్పవాల్చకుండా.

"ఇదిగో! శారదా! ఇటుచూడూ" అంటూ ఆ వుత్తరాన్ని దీపం ముందుకు తీసుకు వెళ్ళాడు సుబ్బారావు. ఎందుకూ? నిప్పులాగు కాలుతున్న గ్లాసును బొబ్బలెక్కిన వ్రేళ్ళతో తీసి పారేశాడు. పొగలు గ్రక్కుతూ ఆ జ్యోతి ఆ వుత్తరాన్ని తనలో ఇనుమడింపచేసుకుంటున్నది. దేదీప్యమానంగా వెలుగుతూన్నది ఆదీపం. ఆ వెలుతురు ప్రతిబింబం శారద కళ్ళల్లో తోకచుక్క లాగు మెరుస్తున్నది. మండిపోతూన్న ఉత్తరం వంక, వెలవెల శారద ముఖంవంక చూస్తూ సుబ్బారావు బరువుగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తున్నాడు. ఆ వుత్తరం వెలుతురులో వారిద్దరి ముఖాలు మాంసపు ముద్దల్లాగు మెరిసిపోతున్నాయి. శారద హృదయంలో మంటలు రేకెత్తుతున్నాయి. తగలబడుతున్నది ఉత్తరమా లేక శారద హృదయమా అని అనుమానం కలుగుతోంది. అబ్బ! ఆ వుత్తరం ఇంకా ఎంతసేపు తగలబడుతుంది అని చూస్తున్నట్టుగా వుంది శారద.

ఆరోజు సాయంకాలం అయిదున్నర గంటలకు ఉదయించిన ఆ వుత్తరం ఒక గంట జీవితం గడపి, ఆ గదిలో నాలుగు గోడల మధ్యా ఒక అయిదు నిముషాలు దేదీప్యమానంగా వెలిగించి ఇప్పుడు కొరగాని బూడిదగా అవతారం మార్చి నేల మీద కదులాడుతోంది. గ్లాసులేని ఆదీపం కూడా ఎందుకో కొండెక్కిపోయింది. గది అంతా చీకటి అలమరించింది. శారద శరీరం స్నానంచేసినట్టుగా తడిసిపోయింది. "ఆహా!" అని బిగియార నోరుతెరచి బిగబట్టిన గాలినంతనూ ఒక్కసారి విడిచేసింది శారద.

కన్ను పొడుచుకున్నా కనుపించని ఆ కటికి చీకటిలో సుబ్బారావు ముఖం ఆమెకు దివ్యతేజస్సుగా గోచరిస్తోంది. అతని ఫాలభాగం మీద ఆమె స్వర్గధామం చూడగలిగింది. అతని కళ్ళల్లో ఆమె కంచు కాగడాలను కనుగొన్నది. అతని హృదయసామ్రాజ్యంలో ఆమె కోసం అమర్చబడిన సువర్ణపథాన్ని ఆమె నేటికి పరిశోధించగలిగింది.

బహుళ తదియనాటి చంద్రుడు అప్పుడే ఉదయించి ఆకాశవీధిలో బిరబిరా సాగిపోతున్నాడు. చంద్రబింబాన్ని వలదని ఆమె అతని ముఖంలోకిచూచింది. ఉప్పొంగిపోయిన నరములతో ఆమెమేను తేలికగా గాలిలోకిలేస్తోంది. అతని ముఖంలోకి చూస్తూ ఆమె ముఖం ముందుకు సాగింది. తన రెండు చేతులతో అతని మెడను పెనవైచి ఆమె పెదవులతో అతని నోటిని కప్పివైచింది. మంత్రముగ్ధలాగు ఆ ఇరువురు అలాగా ఎంతకాలం గడిపారో ఎవరికి తెలుసు?

